# త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ!

- సాయుధ దళాలకు ఫ్రీహ్యాండ్ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ!
- సీడీఎస్ సహా త్రివిధ దళాల అధిపతులతో ప్రత్యేక సమావేశం
- ఉగ్రమూకలను చిత్తు చేయాలన్న ప్రజల డిమాండ్లతో నిర్ణయం
- మోదీ అధ్యక్షతన నేడు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ

## టైమ్, టార్గెట్, మోడ్ ఆఫ్ యాక్షన్.. అంతా మీ ఇష్టం



డెహ్రాడూన్‌లో జరిగిన సూర్య డ్రోన్ టెక్ ఎగ్జిబిషన్‌లో సైనికుల నైపుణ్య ప్రదర్శన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ప్రశాంత కశ్మీరంలో పాకిస్థాన్ ఉగ్రమూకలు రాసిన నెత్తుటి గీతలకు బదులు తీర్చుకొనే సమయం ఆసన్నమైంది? 26 మంది అమాయకుల ప్రాణాలను నిమిషాల వ్యవధిలో గాల్లో కలిపేసిన ముష్కర చర్యలకు చరమగీతం పాడే క్షణాలు దగ్గరపడ్డాయా? ఉగ్రమూకలను తుదముట్టించే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్టు ప్రధాని మోదీ చేసిన తాజా వ్యాఖ్యలు ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) సహా త్రివిధ దళాల అధిపతులతో తన నివాసంలో మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రదాడిపై ప్రతిస్పందించే విషయంలో అనుసరించాల్సిన పద్ధతులు, లక్ష్యాలు, సమయం ఇలా సమస్తం అన్ని అంశాల్లో సైన్యానికి పూర్తి స్థాయిలో ఫ్రీడమ్ ఇస్తున్నట్టు ఆయన వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై యావత్తు జాతి ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నది. ఈ దాడికి పాల్పడిన ముష్కరులతోపాటు వారికి అండగా ఉన్న సూత్రధారులపై కూడా ప్రతీకారం తీర్చుకోవాలన్న డిమాండు తీవ్రతరమైంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. ఉగ్రదాడికి ప్రతి దాడిలో అనుసరించాల్సిన పద్ధతులు (మోడ్ ఆఫ్ యాక్షన్స్), లక్ష్యాలు (టార్గెట్స్), సమయం (టైమ్) ఇలా అన్నింటిపై నిర్ణయం తీసుకొనే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రకటించారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలన్నదే దేశ సంకల్పమన్న ప్రధాని.. భారత సాయుధ దళాల శక్తి, సామర్థ్యాలపై తమకు అచంచలమైన విశ్వాసం ఉన్నదన్నారు. ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్, ఆర్మీ, నేవీ, ఎయిర్ చీఫ్‌లు పాల్గొన్నారు.

**ప్రధానితో భాగవత్, షా భేటీ**

సీడీఎస్ సహా త్రివిధ దళాల అధిపతులతో మోదీ సమావేశం పూర్తయిన వెంటనే.. ప్రధాని నివాసానికి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, హోంమంత్రి అమిత్ షా కలిసి వెళ్లారు. పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాలపై చర్చించినట్టు సమాచారం. కాగా, గత వారం ఓ సభలో భాగవత్ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు గట్టిగా బదులివ్వాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.

**వారంలో రెండో సమావేశం**

పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాల నేపథ్యంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) బుధవారం ప్రత్యేకంగా సమావేశం కానున్నది. వారం వ్యవధిలో ఈ భేటీ రెండోసారి.

**గతంలో ఇలా..**

2016లో ఉరిలో జరిగిన ఉగ్రదాడిలో 19 మంది సైనికులు అమరులయ్యారు. మరో 30 మంది గాయాలపాలయ్యారు. దీంతో నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసి పాక్‌కు తగిన బుద్ధి చెప్పింది. ఇక, 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో ఉగ్రదాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సైనికులు అమరులవ్వగా, మరో 35 మందికి గాయాలయ్యాయి. దీంతో ఉగ్రమూకల స్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టింది. తాజాగా పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న ముష్కరులపై భారత సాయుధ దళాలు ఏ విధంగా ప్రతీకార చర్యలు చేపడుతాయోనన్నది ఆసక్తిగా మారింది.

### 48 పర్యాటక ప్రదేశాలు మూసివేత


పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో మరిన్ని ఉగ్ర దాడులు జరగవచ్చని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు వచ్చిన దరిమిలా కశ్మీరు వ్యాప్తంగా ఉన్న 87 పర్యాటక ప్రదేశాలలో 48 ప్రదేశాలను జమ్ము కశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో ఉన్న కొన్ని స్లీపర్ సెల్స్ యాక్టివేట్ అయ్యాయని, ఉగ్ర చర్యలకు పాల్పడాలని వాటికి ఆదేశాలు జారీ అయ్యాయని నిఘా వర్గాలకు సమాచారం అందినట్లు తెలిసింది. ఈ నెల 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో రానున్న రోజుల్లో భద్రతా దళాలు, స్థానికేతరులే లక్ష్యంగా మరిన్ని దాడులు జరపాలని ఉగ్ర గ్రూపులు చురుకుగా పథక రచన చేస్తున్నాయని నిఘా వర్గాలు తెలిపాయి.

## కాంగ్రెస్-బీజేపీ ఫొటో వార్

### మోదీ, రాహుల్‌పై పరస్పర విమర్శలు




న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలతో దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. అఖిల పక్ష సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ గైర్హాజరు కావడంపై సోమవారం రాత్రి కాంగ్రెస్ ఎక్స్‌లో 'గాయబ్' (మాయం) అన్న శీర్షికతో తల లేని ఓ ఫొటోను పోస్టు చేసింది. ప్రధాని మోదీని పోలిన ఆ ఫోటో ద్వారా పహల్గాం దాడికి ప్రతిచర్య విషయంలో ప్రధాని మోదీ నుంచి కార్యాచరణ శూన్యమన్న సంకేతాలను కాంగ్రెస్ ఈ పోస్టులో వ్యక్తం చేసింది. దీనికి బీజేపీ మంగళవారం కౌంటర్ ఇచ్చింది. తెలుపు రంగు టీషర్టు నలుపు రంగు ప్యాంటు, తలపై నెహ్రూ టోపీ ధరించి కత్తి చేతిలో పట్టుకుని వెనుకకు తిరిగి నిలబడిన ఓ వ్యక్తి ఫోటోను ఎక్స్‌లో పోస్టు చేస్తూ వెన్నుపోటుదారుడిగా చిత్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నించింది.



## పాక్‌పై అంత ప్రేముంటే దేశం వీడండి

### కాంగ్రెస్ నేతలపై పవన్ ఫైర్

హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తుండటం రాజకీయ దుమారం రేపుతున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలపై ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'కొంతమంది నాయకులు పాకిస్థాన్‌పై ప్రేమను ఒలకబోస్తున్నారు. ఇండియాలో ఉంటూ పాకిస్థాన్‌పై ప్రేమను ప్రకటిస్తున్నారు. పాక్‌పై అంత ప్రేముంటే, ఇండియాను విడిచి వెళ్లిపోండి' అని అన్నారు. ఉగ్రదాడులు జరుపుతున్నా, పాక్‌కు మద్దతుగా నిలబడటం కుదరదని అన్నారు.



## పాక్ విమానాలకు మన గగనతలం బంద్!

### ఆ దేశ నౌకలపైనా నిషేధానికి కేంద్రం యోచన

న్యూఢిల్లీ: పాకిస్థాన్ విమానాలు మన గగనతలం గుండా ప్రయాణించకుండా నిషేధం విధించాలని కేంద్రం యోచిస్తున్నది. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. ఒకవేళ నిషేధం విధిస్తే ఆగ్నేయాసియా దేశాలైన మలేసియా వంటి వాటికి వెళ్లడానికి చైనా లేదా శ్రీలంక ఆకాశ మార్గాలను పాక్ ఎంచుకోవాల్సి ఉంటుంది. మరోవైపు పాక్ నౌకలు మన దేశ నౌకాశ్రయాల్లోకి ప్రవేశించకుండా నిషేధం విధించాలని కేంద్రం భావిస్తున్నది. ఇప్పటికే పాక్ తన గగనతలం గుండా భారత విమానాలు వెళ్లకుండా నిషేధం విధించింది.

## సరిహద్దులకు రాడార్ వ్యవస్థలు తరలిస్తున్న పాక్

### భారత్ దాడుల భయమే కారణం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ దాడులు చేయవచ్చనే భయంతో సరిహద్దులకు పాకిస్థాన్ రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నది. భారత విమానాల కదలికలను పసి గట్టేందుకు సియాల్‌కోట్, ఫెరోజ్‌పూర్ సెక్టార్లలో ఈ మోహరింపులు జరిగినట్టు ఇండియా టుడే పేర్కొంది. ఇటీవల అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 58 కిలోమీటర్ల దూరంలో ఖోర్ కంటోన్మెంట్‌లో అత్యాధునిక టీపీఎస్-77 రాడార్‌ను పాక్ సైన్యం నిఘా కోసం ఉంచింది. మరోవైపు వరుసగా అయిదో రోజు నియంత్రణ రేఖ వద్ద పాక్ సైన్యం కవ్వింపు కాల్పులకు పాల్పడింది. అయితే భారత సైనికులు వాటిని సమర్థంగా తిప్పికొట్టారు. భారత్ తమపై దాడి చేయడం అనివార్యమని ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## పాకిస్థాన్ జిందాబాద్ అన్నందుకు కొట్టి చంపారు!

### కర్ణాటకలో క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఘటన

మంగళూరు: కర్ణాటకలోని మంగళూరు సమీపంలో ఈ నెల 27న జరిగిన ఓ క్రికెట్ మ్యాచ్‌లో ఓ వ్యక్తి పాకిస్థాన్ జిందాబాద్ అని నినదించినందుకు అతడిని కొందరు చావబాదారు. బాధితుడు తీవ్ర గాయాలతో దవాఖానలో మృతి చెందాడు. మంగళవారం పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కుడుపు గ్రామంలోని ఓ గుడి వద్ద ఈ ఘటన జరిగింది. మృతుడి వివరాలు వెల్లడి కాలేదు. 'స్థానిక క్రికెట్ మ్యాచ్‌లో ఈ దుర్ఘటన జరిగింది. 12 మంది నిందితులను అదుపులోని తీసుకున్నాం. కేసు దర్యాప్తులో ఉంది. ప్రజలు శాంతి సామరస్యాలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర అన్నారు. కట్టెలతో తీవ్రంగా కొట్టడంతో అంతర్గతంగా రక్త స్రావం జరగడం, సమయానికి వైద్యం అందకపోవడం వల్ల బాధితుడు మృతి చెందినట్టు శవ పరీక్ష నివేదిక వెల్లడించింది.

## ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను బ్లాక్ చేసి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి భద్రతా బలగాలు, దర్యాప్తు బృందాలు కీలక విషయాలను సేకరిస్తున్నారు. పర్యాటకులు తప్పించుకోకుండా బైసరన్ వ్యాలీలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్స్‌ను ఉగ్రవాదులు బ్లాక్ చేశారని తెలిసింది. ఎగ్జిట్ పాయింట్ వద్ద ఒక ఉగ్రవాది తొలుత కాల్పులు జరపటంతో, పర్యాటకులు ఎంట్రీ పాయింట్ వైపునకు పరిగెత్తారని, అక్కడ కాపు కాచిన ఉగ్రవాదులు వాళ్లను చుట్టుముట్టి కాల్పులు జరిపినట్టు దర్యాప్తు సంస్థల విచారణలో తేలింది. వాస్తవానికి, ఏప్రిల్ 22 కంటే రెండ్రోజుల ముందే పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసేందుకు పథకం వేసినట్టు సమాచారం. అయితే 20న అక్కడ భారీ వర్షం కురిసింది. చాలా మంది పర్యాటకులు పహల్గాం సందర్శన వాయిదా వేసుకున్నారు. దీంతో ఉగ్రవాదులు తమ దాడిని 22వ తేదీకి వాయిదా వేసుకున్నట్టు భద్రతా బలగాలు వెల్లడించాయి.

## వరుసగా ఐదో రోజూ పాక్ కాల్పులు

### దీటుగా జవాబిచ్చిన భారత దళాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పహల్గాం ఉగ్రదాడి దరిమిలా భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో జమ్ము కశ్మీరులోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి పాకిస్థానీ బలగాలు సోమవారం రాత్రి వరుసగా ఐదో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయి. పాక్ దళాల కవ్వింపు కాల్పులకు భారత దళాలు దీటుగా సమాధానమిచ్చినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. కుప్వారా, బారాముల్లా జిల్లాలతో పాటు అక్నూర్ సెక్టార్ సమీప ప్రాంతాలలో పాక్ సైనిక బలగాలు కాల్పులు జరిపినట్లు అధికారులు చెప్పారు. గురువారం రాత్రి నుంచి పాకిస్థానీ సైనికులు ఎల్‌వోసీ వెంబడి వివిధ ప్రాంతాలలో భారత బలగాలపై కాల్పులు జరుపుతున్నారు. అయితే ప్రాణ నష్టం జరిగినట్లు వార్తలు రాలేదు.

## పాక్‌కు పంపుతున్న వాళ్లలో శౌర్యచక్ర గ్రహీత తల్లి

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ జాతీయులు, వలసదారులను స్వదేశానికి పంపేందుకు కేంద్రం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కశ్మీర్ అధికార యంత్రాంగం 60 మంది పాకిస్థానీయులతో సిద్ధం చేసిన జాబితాలో, శౌర్యచక్ర అందుకున్న ఓ కానిస్టేబుల్ తల్లి కూడా ఉండటం చర్చనీయాంశమైంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న 60 మందిని బస్సుల్లో పంజాబ్‌కు పంపారు. అక్కడ వీళ్లను వాఘా సరిహద్దులో పాక్ అధికారులకు అప్పగించనున్నారు. అలాగే సీఆర్‌పీఎఫ్ జవాన్ భార్య, పాకిస్థానీయురాలు మినాల్ ఖాన్ కూడా ఈ జాబితాలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## బర్త్ సర్టిఫికెట్‌తోనే పౌరసత్వ నిర్ధారణ

### ఆధార్, పాన్, రేషన్ కార్డులు చెల్లవు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: జనన ధ్రువీకరణ, శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను మాత్రమే పౌరసత్వాన్ని రుజువు చేసే అధికారిక పత్రాలుగా గుర్తిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. జనన, మరణ ధ్రువీకరణ చట్టం, 1969 ప్రకారం నిర్దేశిత అధికారులు మాత్రమే జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. అలాగే ఒక వ్యక్తి నిర్దేశిత రాష్ట్ర, యూటీ పరిధిలో నివసించారని నివాస ధ్రువీకరణ పత్రాలు నిర్ధారిస్తాయి. ఇది అతడు లేక ఆమె భారతీయ పౌరసత్వాన్ని కలిగి ఉన్నాడన్న వాదనలను రుజువు చేస్తాయి. ఈ పత్రాలు లేనివారు తమ పౌరసత్వ నిర్ధారణకు సంబంధిత మున్సిపల్ లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆశ్రయించాల్సి ఉంటుంది.

## 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకం

### కేంద్రం నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ: తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా(సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మంగళవారం నియమితులయ్యారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు. మరుసటి రోజు అంటే మే 14న సీజేఐగా జస్టిస్ గవాయ్ పదవీ బాధ్యతలు చేపడతారు. 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకాన్ని ప్రకటిస్తూ కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ పేరును సీజేఐ ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఆరు నెలల పాటు జస్టిస్ గవాయ్ సీజేఐగా కొనసాగనున్నారు.

## కాబోయే అత్తతో అల్లుడి పరార్

### పోలీసులకు వధువు ఫిర్యాదు

గోండ (యూపీ): కాబోయే అత్తతో కలిసి అలీగఢ్ వ్యక్తి పారిపోయిన ఉదంతం మరువకముందే అలాంటి ఘటనే ఈసారి యూపీలోని గోండ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం 25 ఏండ్ల సుశీల్ (పేరు మార్చారు) తాను పెండ్లి చేసుకోబోయే వధువు తల్లి రేఖ (పేరు మార్చారు)తో శనివారం పారిపోయాడు. దీనిపై వధువు గీత (పేరు మార్చారు), ఆమె కుటుంబ సభ్యులు ఖోడారే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసును నమోదు చేశారు. వీరి వివాహం నాలుగు నెలల క్రితమే నిశ్చయమైంది. ఈ క్రమంలో సుశీల్, రేఖా తరచూ మొబైల్ ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడుకునే వారు. వారిద్దరి వైఖరిని రేఖ కుటుంబ సభ్యులు అనుమానించి వివాహ వేదికను మార్చినా ఫలితం లేకపోయింది.

# సరిహద్దుల్లో పిల్లల్ని వదిలేసి!

- అమెరికాలో అక్రమ ప్రవేశానికి భారతీయుల వ్యూహం
- శరణార్థులుగా వారికి ఆశ్రయం కల్పిస్తున్న అధికారులు
- ఆరు నుంచి ఎనిమిది నెలల్లో ఆ బాలలకు గ్రీన్‌కార్డు
- ఆ పిల్లల కోసం వెళ్లి అగ్ర రాజ్యంలో స్థిరపడుతున్న తల్లిదండ్రులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: కరోనా మొదటి దశ (2020)లో పలువురు విదేశీయులు ఎటువంటి పత్రాలు లేకుండా అమెరికాలోకి చొరబడ్డారు. అదే మార్గంలో గుజరాత్‌లోని మెహసానా జిల్లా కడీ ప్రాంతానికి చెందిన లాయర్ దంపతులు తమ రెండేండ్ల కుమారుడిని ఇండియాలోనే వదిలేసి అమెరికాలో కాలుపెట్టారు. ఆ తరువాత రెండేండ్లకు వారి బంధువు ఒకరు (అక్రమ మార్గంలో) అమెరికా వస్తుండగా తమ కుమారుడిని కూడా వెంటపెట్టుకొని రమ్మని చెప్పారు. అప్పటికి ఐదేండ్ల వయసున్న బాలుడిని ఆ బంధువు టెక్సాస్ సరిహద్దులో వదిలేసి మాయమైపోయాడు. అమెరికా భద్రతా అధికారికి దొరికిన ఆ బాలుడి జేబులో ఓ చీటీ లభించింది. ఆ చీటీలో బాలుడి తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నంబర్లు ఉన్నాయి. వాటి ఆధారంగా తల్లిదండ్రులను సంప్రదించిన అధికారులు ఆ బాలుడిని వారికి అప్పగించారు. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ఇలా 'వ్యూహాత్మకంగా వదిలిపెట్టడం' అనే పద్ధతిని అనుసరిస్తున్నారని ఓ అధికారి తెలిపారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో ఇలా మెక్సికో లేదా కెనడా సరిహద్దుల్లో భారతీయుల పిల్లలు అధికారులకు దొరుకుతుంటారని చెప్పారు. అమెరికా కస్టమ్స్, బార్డర్ ప్రొటెక్షన్ నివేదిక ప్రకారం 2022 నుంచి 2025 వరకు 1,656 మంది భారతీయ మైనర్లు అమెరికాలోకి ఇదే పద్ధతిలో ప్రవేశించినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.

**వ్యూహం ఎలాగంటే?**

ఈ పిల్లలు వారి తల్లిదండ్రులకు 'గ్రీన్‌కార్డు'లుగా ఉపయోగపడుతున్నారు. ఇమిగ్రేషన్ నెట్‌వర్క్‌కు చెందిన ఓ అధికారి ఈ విధానాన్ని వివరిస్తూ.. 'ముందుగా ఏదో ఒక అక్రమ మార్గంలో తల్లిదండ్రులు వచ్చేస్తారు. ఆ తరువాత అదే అక్రమ మార్గంలో వచ్చే ఇతరులతో తమ పిల్లలను తెప్పించుకుంటారు. సరిహద్దుల్లో అధికారులకు ఆ పిల్లలు అనాథలుగా దొరికిపోతారు. మానవతా దృక్పథంతో అధికారులు వారిని శరణార్థులుగా పరిగణించి ఆశ్రయం కల్పిస్తారు. ఆ తరువాత వారు తమ తల్లిదండ్రులను చేరుకుంటారు. కొన్నిసార్లు పిల్లలు ముందుగా వస్తారు. ఆ తరువాత వారిని వెతక్కుంటూ వచ్చినట్టు తల్లిదండ్రులు వచ్చి తమకు కూడా ఆశ్రయం కల్పించాలని దరఖాస్తు చేసుకుంటారు. తమ పిల్లలు ఇప్పటికే అమెరికాలో ఉన్నారని, వారి వద్దకు తమను చేర్చాలని కోరుతారు. ఇలా శరణార్థులుగా వచ్చిన పిల్లలు అమెరికాలో విద్య, వైద్య సదుపాయాలను ఉచితంగా పొందుతారు' అని ఆ అధికారి వివరించారు. శరణార్థులుగా వచ్చిన బాలలకు అమెరికా జువెనైల్ కోర్టుల రూలింగ్ ప్రకారం ఆరు నుంచి ఎనిమిది నెలల్లో గ్రీన్ కార్డు మంజూరు చేయాల్సి ఉంటుందని ఇమిగ్రేషన్ అధికారి చెప్పారు.

## దేశ వ్యతిరేకులపై స్పైవేర్‌ను వాడితే తప్పేంటి?

### ఎవరిపైన దీన్ని ప్రయోగిస్తున్నారన్నదే ప్రధానం

పెగాసస్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: జాతీయ భద్రతావసరాల కోసం దేశం స్పైవేర్‌ను పొందడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. అయితే ఎవరిపైన ఈ స్పైవేర్‌ను వాడుతున్నారన్నదే ముఖ్యమైన అంశమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రైవేట్ వ్యక్తులపై దీన్ని ప్రయోగిస్తున్నారన్న ఆరోపణలను పరిశీలిస్తామని దేశ అత్యున్నత న్యాయస్థానం హామీ ఇచ్చింది. ఇజ్రాయెల్‌కు చెందిన స్పైవేర్ పెగాసస్‌ని ఉపయోగించి పలువురు ప్రముఖులపై ప్రభుత్వం నిఘా పెట్టిందన్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాజ్యాంగం ప్రకారం ప్రైవసీ హక్కు కలిగి ఉన్న పౌరుడిని కాపాడతామని జస్టిస్ సూర్యకాంత్ హామీ ఇచ్చారు.

## కెనడా ఎన్నికల్లో లిబరల్స్‌కే పట్టం

### మళ్లీ ప్రధానిగా కార్నీ ▪ ఖలిస్థాన్ అనుకూల నేత జగ్మీత్‌సింగ్‌కు భంగపాటు

టొరంటో, ఏప్రిల్ 29: కెనడా సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మార్క్ కార్నీ నేతృత్వంలోని లిబరల్ పార్టీ ఆధిక్యం ప్రదర్శిస్తూ మరోసారి అధికారం చేపట్టే దిశగా దూసుకుపోతున్నది. కెనడా పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో 343 సీట్లుండగా అధికారం చేపట్టాలంటే 172 సీట్లు రావాలి. ఓట్ల లెక్కింపు నిలిపివేసే నాటికి అధికార లిబరల్స్ 168 సీట్లలో గెలుపు/ఆధిక్యంలో ఉన్నారు. పూర్తి మెజారిటీకి వారు ఇంకా నాలుగు సీట్ల దూరంలో ఉన్నారు. 144 సీట్లతో కన్జర్వేటివ్ పార్టీ వారిని అనుసరించింది. ఖలిస్థాన్ అనుకూలుడైన జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమోక్రాటిక్ పార్టీ కేవలం 4-7 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఓటమికి బాధ్యత వహిస్తూ ఆయన పార్టీకి రాజీనామా చేశారు. కార్నీ పార్టీ గెలవడం, జగ్మీత్ సింగ్ ఓడటం భారత్‌కు శుభవార్తేనని చెప్పవచ్చు. ఎందుకంటే ఇటీవల దెబ్బతిన్న రెండు దేశాల దౌత్య సంబంధాలు ఈ ఎన్నికల ఫలితాల అనంతరం పునరుద్ధరణకు అవకాశాలు ఉన్నాయి.

### భార్య, కుమారుడిని కాల్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకున్న ఇండియన్ అమెరికన్

వాషింగ్టన్, ఏప్రిల్ 29: భారత సంతతికి చెందిన వ్యాపార వేత్త హర్షవర్ధన్ ఎస్ కిక్కేరి(55) అమెరికాలో ఘోరానికి పాల్పడ్డాడు. భార్య శ్వేత (44) కుమారుడిని కాల్చి చంపి తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. వాషింగ్టన్‌లోని న్యూకాజల్‌లో ఈ నెల 24న ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దారుణం జరిగిన సమయంలో అతని ఇంకో కుమారుడు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఈ ఘటనకు ఎందుకు పాల్పడిందీ కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

### కెనడాలో ఆప్ నేత కుమార్తె అనుమానాస్పద మృతి

ఒట్టావా, ఏప్రిల్ 29: మూడు రోజుల క్రితం ఒట్టావా ప్రావిన్స్‌లో కన్పించకుండా పోయిన 21 ఏండ్ల భారతీయ విద్యార్థిని శవమై కన్పించింది. పంజాబ్ ఆప్ నేత దేవీందర్ సింగ్ కుమార్తె అయిన వంశిక రెండున్నరేండ్ల క్రితం డిప్లమో విద్యనభ్యసించడానికి కెనడా వెళ్లింది. ఒట్టావాలోని 7 మెజిస్టిక్ డ్రైవ్‌లో ఉన్న ఇంటి నుంచి అద్దె గదిని చూడటానికి శుక్రవారం రాత్రి 8-9 గంటల మధ్య బయటకు వెళ్లింది.అయితే ఆమె మూడు రోజుల తర్వాత స్థానికంగా ఉన్న ఒక బీచ్‌లో శవమై కన్పించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### భారత్, పాక్ సోదరులారా.. డిస్కౌంట్లు అడగొద్దు ప్లీజ్!

**ఆన్‌లైన్‌లో నవ్వులు రేపిన ఇస్తాంబుల్ హోటల్ విజ్ఞప్తి**

ఇస్తాంబుల్: ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో ఆసక్తికర చర్చను రేకెత్తించింది. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో డిస్కౌంట్లపై ఓ హోటల్ చేసిన విజ్ఞప్తిపై నెటిజన్లు సరదాగా స్పందించారు. 'భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సోదరులారా.. దయచేసి రాయితీ కోసం అడగొద్దు' అని కేవలం దక్షిణాసియా వాసులకు మాత్రమే ఆ హోటల్‌లో సూచన ఉండటం తనను ఆకర్షించిందని వీడియోను పోస్ట్ చేసిన వ్యక్తి తెలిపారు. దీనిపై ఒక యూజర్ స్పందిస్తూ.. 'సరిహద్దుల వల్ల విభజించబడి ఉన్నాం. కానీ అంతర్జాతీయంగా చికాకు కలిగించడంలో ఐకమత్యంగా ఉన్నాం' అని వ్యాఖ్యానించారు. మరొకరు 'వాళ్లు డిస్కౌంట్ కోసం అడగరు.. అర్థిస్తారు.. దాని గురించి అర గంట మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోతారు. నాకు వ్యాపారంలో ఇది అనుభవమే.' అని వ్యాఖ్యానించారు. దక్షిణాసియా మార్కెట్లలో కస్టమర్లు రాయితీలు అడగడం పరిపాటి.

## అంతరిక్షంలో చేపల పెంపకం!

- జాబిల్లిపై ప్రయోగం
- వ్యోమగాములకు ఆహార సరఫరాలో కీలకం
- విజయవంతమైతే రోదసిలో ఆహార ఇబ్బందులు తొలగినట్టే
- ఫ్రెంచ్ శాస్త్రవేత్తల పరిశోధనలు



పారిస్: వ్యోమగాములకు ఆహార సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడంపై ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. మాంసాహార ఉత్పత్తులపై ప్రయోగాలు చేస్తున్నారు. లూనార్ హాచ్ ప్రాజెక్టులో భాగంగా పరిశోధకుడు డాక్టర్ సిరిల్లె ప్రిబ్జిలా నేతృత్వంలో అంతరిక్షంలో ఆక్వాకల్చర్‌పై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇది విజయవంతమైతే వ్యోమగాములకు భూమిపై నుంచి ఆహారం పంపించే కష్టాలు తొలగిపోతాయి.

**వారానికి రెండుసార్లు చేపలు...**

పరిశోధనల్లో భాగంగా 'సీ బాస్' రకం చేపలను (సముద్రపు చేపలు) అంతరిక్షంలో పెంచాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు ఉండాల్సిన ముఖ్యమైన లక్షణం బరువు లేని తనం (వెయిట్‌లెస్‌నెస్) ఉండటంతోనే శాస్త్రవేత్తలు వీటిని ఎంచుకున్నారు. రాకెట్ లాంచ్ సమయంలో ఉండే వైబ్రేషన్, హైపర్‌గ్రావిటీ, మైక్రోగ్రావిటీ, కాస్మిక్ రేడియేషన్ తదితర పరిస్థితుల్లో సీ బాస్ చేపల గుడ్లు మనుగడ సాగిస్తాయా, లేదా? అనే అంశాన్ని ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. ఈ చేపల గుడ్లు ఇప్పటికే అనేక టెస్టుల్లో పాస్ అయినట్టు తెలుస్తున్నది. ఈ గుడ్లను అంతరిక్షంలోకి పంపించి, అక్కడ చేపలను పెంచి, వాటిని తొలుత భూమిపైకి పంపిస్తారు. వాటిపై అంతరిక్ష పరిస్థితుల ప్రభావం ఎంతమేరకు ఉందనే విషయమై విశ్లేషిస్తారు. అనంతరం ఈ ప్రయోగం విజయవంతమైతే వ్యోమగాములకు వారానికి రెండుసార్లు చేపలను ఆహారంగా అందించాలని భావిస్తున్నారు.



## మే 29న రోదసిలోకి శుభాన్షు శుక్లా

### ఐఎస్ఎస్‌లో అడుగుపెడుతున్న తొలి భారతీయుడిగా రికార్డ్!

వాషింగ్టన్: 'ఏఎక్స్-4' మిషన్ పైలట్‌గా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా మే 29న అంతరిక్షంలోకి వెళ్తున్నారు. భారత్, పోలండ్, హంగేరీ వ్యోమగాములతో కూడిన అంతర్జాతీయ బృందానికి నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్ నేతృత్వం వహిస్తున్నారు. వ్యోమగాములు ప్రయాణిస్తున్న స్పేస్ ఎక్స్ డ్రాగన్ రాకెట్‌ను మే 29 ఉదయం 10.33 గంటలకు ప్రయోగిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రయోగంతో ఐఎస్ఎస్‌లో అడుగుపెడుతున్న తొలి భారతీయుడిగా శుక్లా రికార్డ్ సృష్టించనున్నారు. సోవియట్ రష్యా 1984లో భారత వ్యోమగామి రాకేశ్ శర్మను అంతరిక్షంలోకి పంపింది. రోదసిలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా ఆయన రికార్డ్ సృష్టించారు. ఆ తర్వాత మళ్లీ ఇన్నేండ్లకు ఓ భారత వ్యోమగామి అంతరిక్షంలోకి వెళ్లటం ఇదే మొదటిసారి.

## రాజు పైలట్.. రాణి కో పైలట్

### స్వయంగా విమానాన్ని నడుపుతూ భూటాన్ పర్యటనకు థాయ్‌లాండ్ రాజ దంపతులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: సాధారణంగా దేశాధినేతల విదేశీ పర్యటనలు అత్యంత కట్టుదిట్టమైన భద్రత, విస్తృతమైన ప్రొటోకాల్ ఏర్పాట్ల మధ్య జరుగుతుంటాయి. కానీ, ఇటీవల భూటాన్ పర్యటనకు వెళ్లిన థాయ్‌లాండ్ రాజ దంపతులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ అధికారిక పర్యటనలో రాజు మహా వజ్రలాంగ్‌కోర్న్, రాణి సుతీద థాయ్‌లాండ్ రాజకుటుంబానికి చెందిన బోయింగ్ 737-800 విమానాన్ని స్వయంగా నడుపుతూ ఈ నెల 25న భూటాన్‌లో అడుగుపెట్టారు. అది కూడా ప్రపంచంలోనే అత్యంత సవాళ్లతో కూడిన పారో అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యంత చాకచక్యంగా, సురక్షితంగా ఆ విమానాన్ని దింపి అందరినీ ఔరా అనిపించారు. అక్కడ వారికి భూటాన్ రాజ కుటుంబం ఘన స్వాగతం పలికింది. అనంతరం భూటాన్‌లో నాలుగు రోజులపాటు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న థాయ్ రాజ దంపతులు సోమవారం తమ స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. అప్పుడు సైతం వజ్రలాంగ్‌కోర్న్ పైలట్‌గా, సుతీద కో-పైలట్‌గా ఆ విమానాన్ని స్వయంగా నడుపుకుంటూ వెళ్లిపోయారు. 2019లో థాయ్‌లాండ్ రాజుగా బాధ్యతలు చేపట్టిన వజ్రలాంగ్‌కోర్న్ ఆ హోదాలో విదేశీ పర్యటన జరపడం ఇదే తొలిసారి. గతంలో రాయల్ థాయ్ ఆర్మీలో కెరీర్ ఆఫీసర్‌గా పనిచేసిన వజ్రలాంగ్‌కోర్న్.. అప్పట్లోనే ఎఫ్-5, ఎఫ్-16, బోయింగ్ 737-400 విమానాలను నడిపే అర్హత పొందారు. అదే ఇప్పుడు ఆయన స్వయంగా విమానాన్ని నడిపేందుకు దోహదపడింది.